క్లుప్తంగా

భర్త హత్యకేసులో భార్యకు జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయించిన భార్యకు, హత్య చేసిన నిందితుడికి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. వివరాలు ఇలా.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన ఫకీర్ షబ్బీర్ (31) 2022 సెప్టెంబర్ 20న తాడ్వాయి మండలం కన్కల్ శివారులో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గరయ్యాడు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా.. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని మృతుడి భార్య నసీమానే హత్యకు పథకం వేసిందనీ, ఒడ్డె హన్మంతు అనే మరో వ్యక్తితో హత్య చేయించిందని తేలింది. దీంతో అప్పట్లోనే తాడ్వాయి పోలీసులు హన్మంతు, నసీమాలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కోర్టులో నేరం రుజువుకావడంతో నిందితులకు జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు.

పంటల పరిశీలన

తాడ్వాయి (ఎల్లారెడ్డి): నందివాడ, పల్లెగడ్డాతండా శివారులోని పంటలను గురువారం మండల వ్యవసాయ అధికారి నర్సింలు పరిశీలించారు. ఖరీఫ్‌లో వేసిన సోయా, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలను పరిశీలించిన అనంతరం పలు సూచనలు చేశారు. చీడపీడలు, పోషక లోపాల సవరణ గురించి వివరించారు. ఆయన వెంట ఏఈవో అశోక్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



రాజంపేట: గుండారం ప్రాథమిక పాఠశాలలో గురువారం సరస్వతి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణ తెలిపారు. గ్రామానికి చెందిన 2011–12 బ్యాచుకు చెందిన పూర్వ విద్యార్థులు విరాళంగా విగ్రహాన్ని ఇవ్వనుండగా అదే గ్రామానికి చెందిన ఎలిచాల భూపాల్ విరాళంగా గద్దె నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. కొండాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

బీబీపేట: మండలంలోని 11 గ్రామాల్లో నేటి నుంచి జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు కొనసాగుతాయని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ తెలిపారు. గురువారం ప్రజాపరిషత్ కార్యాలయంలో సీఆర్‌పీలు, సామాజిక తనిఖీ సిబ్బంది, క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంవత్సర కాలం నుంచి చేసిన ఉపాధి హామీ పనుల వివరాలను తనిఖీ సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. అంతే కాకుండా చేసిన పనుల ప్రదేశంలో కొలతలు సరిగ్గా తీసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీవో అబ్బాగౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గణేష్ ఉత్సవాలలో డీజేలకు అనుమతులు లేవని నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం పలువురు డీజే నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు గణేష్ మండపాల వద్ద డీజేలను నిషేధించారన్నారు. డీజేల ఏర్పాటు వల్ల వృద్ధులు, చిన్నపిల్లలకు గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని వివరించారు. డీజేలను ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీజే నిర్వాహకులను స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

హౌసింగ్ ఏఈగా సుచిత్ర

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల హౌసింగ్ ఏఈగా సుచిత్ర బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సదాశివనగర్ మండలంలో హౌసింగ్ డీఈ, ఏఈ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచిస్తున్నట్లు తెలిపారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బీబీపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు రాంరెడ్డిపల్లిలోని పలు కాలనీలను పరిశీలించారు. మురికి కాలువలు, ఇళ్ల చుట్టు పక్కల పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని సూచించారు. అంతే కాకుండా వర్షాలకు నీరు నిల్వ ఉన్నచోట దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శి రమేష్, తదితరులున్నారు.

వానొస్తే ముంపు ముప్పు

- కబ్జాకు గురవుతున్న కాలువలు
- నామరూపాల్లేని నాలాలు
- ముందస్తు చర్యలు లేక కొత్త కాలనీల రోడ్లపై నీటి నిల్వ
- జనాలకు తప్పని తిప్పలు



ఇరిగేషన్ కార్యాలయం ముందు నిలిచిన వర్షపు నీరు (ఫైల్)



ఇటీవల కురిసిన వర్షాలకు సాయికృపానగర్ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

బాన్సువాడ: ముందస్తు చర్యలు లేక పట్టణంలోని కొత్త కాలనీలు నీట మునుగుతున్నాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ జలమయం అవుతుండగా.. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రతి ఏడాది ఈ దుస్థితిపై ప్రజలు విన్నపాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పడిన చైతన్యకాలనీ, సాయికృపా కాలనీ, వాసవీకాలనీ, అరాఫత్‌కాలనీ, బీసీ కాలనీ, ఎన్‌జీవోఎస్ తదితర కాలనీలు జలమయమవుతున్నాయి. ఇవి లోతట్టు ప్రాంతంలో ఉండటంతో డ్రైనేజీలు నిర్మించినప్పటికి రోడ్లపై నీరు నిల్వ ఉంటుంది. చిన్నపాటి వర్షాలకు రోడ్లన్నీ బురదగా మారి కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఎక్సైజ్, ఇరిగేషన్ కార్యాలయాల్లోకి వరద..

పట్టణంలోని సాయికృపా నగర్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఇళ్లల్లోకి జనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ కాలనీలో ఉన్న ఎక్సైజ్, ఇరిగేషన్ కార్యాలయాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. డ్రైనేజీ డిజైన్ లెవల్స్ రూపొందించిన ఇంజినీరింగ్ విభాగం విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నిర్మాణ పనులు జరిగే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అయితే కొత్త కాలనీల్లో ఇళ్ల మధ్య, రోడ్లపై నిలిచిన నీటి నిల్వపై అధికారులు ఎలాంటి సర్వే చేపట్టడడం లేదు. ఏటా వర్షాకాలం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది. తాత్కాలిక చర్యల పేరిట రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. దీంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది. వర్షం నీరు ఏ విధంగా తగ్గించాలనే విషయంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. కొత్తగా వెలిసిన వెంచర్లలో రియల్ వ్యాపారులు సైతం డ్రెయినేజీలు, రోడ్లు లేకుండానే ప్లాట్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారే తప్ప ప్లాట్లు కొనుగోలు చేసి ఇల్లు కట్టుకునే వారి గురించి ఆలోచించడం లేదు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఎత్తులో నిర్మించాల్సింది

సాయికృపానగర్ కాలనీలో ఎక్సైజ్ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయం కింది నుంచే నిర్మాణాలు చేపట్టడం, సీసీ రోడ్డు ఎక్కువ ఎత్తుగా వేయడంతో వర్షానికి నీరు వచ్చింది. మున్సిపల్ సిబ్బందితో నీరు నిల్వ లేకుండా చేస్తున్నాం. కొత్త కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాం.

– శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

ఎర్రబడిన మొక్కజొన్న పంటలు



నీరు నిలవడంతో ఎర్రబడిన మొక్కజొన్న

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో ఇటీవల భారీ వర్షాలు కురిసి మొక్క జొన్న పంటలో నీరు నిలవడంతో మొక్కలు ఎర్రబడ్డాయి. ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న, పత్తి, సోయా, వరి, కంది, పెసర, మినుము, కూరగాయల పంటలను వేశారు. కాగా మండలంలో 17,880 ఎకరాలలో మొక్క జొన్న పంటను వేశారు. అందులో 40 శాతం పంటలలో నీరు చేరి ఎర్రబడ్డాయి. దీంతో మొక్కలు పెరిగే అవకాశం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడ్వాయి, బ్రాహ్మణపల్లి, కన్కల్, దేమికలాన్, ఎండ్రియాల్, క్రిష్ణాజీవాడి, చిట్యాల, సోమారం, దేవాయిపల్లి, చందాపూర్ తదితర గ్రామాలలో ఉన్న మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే ఎకరానికి రూ.15వేల చొప్పున ఖర్చులు చేశామని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలను సర్వే చేయించి నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

గొర్రెల కాపరులను కాపాడిన ఎమ్మెల్యేకు సన్మానం



మద్నూర్‌లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కుర్మసంఘం సభ్యులు

మద్నూర్(జుక్కల్): నాలుగు రోజుల క్రితం శెట్లూర్ శివారులోని మంజీర వాగులో వరద నీటిలో చిక్కుకున్న నలుగురు గొర్రెల కాపరులు, 656 గొర్రెలను కాపాడిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును మా ప్రాణాలు నిలిపిన దేవుడని కొనియాడుతూ కుర్మ కులస్తులు సన్మానించారు. మండల కేంద్రంలోని మైథిలి ఫంక్షన్‌హాల్‌లో గురువారం కుర్మసంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వారు గొర్రెపిల్లను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుడూ.. జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటానని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు శ్రమించడంతో ఫలితం దక్కిందని అన్నారు. అంతకుముందు రాచూర్ గ్రామంలో ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారని ఎమ్మెల్యేకు తెలియజేయడంతో స్పందించిన ఆయన గురువారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్య సిబ్బందకి పలు సూచనలు, సలహాలు అందించారు. ఆ తర్వాత మద్నూర్ కొత్త బస్టాండ్ ప్రాంతంలో నూతన నిర్మించిన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన, శిఖర స్థాపన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘ భవనం ప్రహరీ కోసం రూ.20 లక్షలను ఎమ్మెల్యే మంజూరు చేశారు. బీసీ కమ్యూనిటి హాల్‌ను ప్రారంభించారు.

భూములు కోల్పోతున్న రైతుల వివరాల సేకరణ



భూములను పరిశీలిస్తున్న అధికారులు

పిట్లం(జుక్కల్): నిజాంసాగర ప్రాజెక్ట్ కింద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాగమడుగు లిఫ్ట్ నిర్మాణంలో భాగంగా పిట్లం మండలంలోని అన్నారం, నాగంపల్లి గ్రామాలలో భూములు కోల్పోతున్న రైతుల వివరాలను తహసీల్దార్ రాజు నరేందర్ గౌడ్ సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న వివరాల సేకరణలో ఏమైనా పొరపాట్లు ఉన్నాయా, పట్టా పాస్ బుక్, పట్టా నంబర్ తప్పుగా నమోదు, పట్టాదారుని పేరు తప్పుగా నమోదు ఏమైనా జరిగాయా అని పరిశీలించినట్లు తెలిపారు. భూనిర్వాసితుల జాబితాను పకడ్బందీగా, చిత్తశుద్ధితో తయారు చేస్తున్నామని..భూనిర్వాసితులకు ప్రభుత్వం సూచించిన ధర వస్తుందని తెలిపారు. ఆర్ఐ శీతల్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని తహసీల్దార్ దశరథ్‌కు బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సుభాష్ మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.35 వేల నష్ట పరిహారం ఇవ్వాలని, మూడు నెలల క్రితం రైతుల వద్ద కొనుగోలు చేసిన సన్న వడ్లకు బోనస్ కూడా చెల్లించాలని కోరారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ కృష్ణ పంతులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలపై అవగాహన



ఎల్లారెడ్డి: వీధి వ్యాపారులు బ్యాంకుల ద్వారా రుణ సహాయం పొందవచ్చని ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణం గాంధీచౌక్‌లో వీధి వ్యాపారులకు బ్యాంకు రుణాల గురించి అవగాహన కల్పించారు. వీధి వ్యాపారులు గ్రూపులుగా ఏర్పడితే వారికి బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. వీధి వ్యాపారులు మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

భిక్కనూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సత్తా చాటాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం భిక్కనూరు పాత దళితవాడకు చెందిన యువకులు 35 మంది బీఆర్ఎస్, బీఎస్పీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ నాయకుడు విజయ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి షబ్బీర్ అలీ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో ప్రజలందరికి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుతున్నాయన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు అందె దయాకర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరాం వెంకటేశ్, నేతలు విజయకుమార్ గౌడ్, నర్మల రాంచంద్రం, నాగరాజు, సాజీద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



పిట్లం(జుక్కల్): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గోద్మేగాం నుంచి కంబాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు, మధ్యలో ఉన్న బ్రిడ్జి దెబ్బతినడంతో గురువారం మాజీ ఎమ్మెల్యే అరుణతార పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. అదేవిధంగా పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, ప్రధాన కార్యదర్శి రాజు, దేవేందర్, ఉపాధ్యక్షుడు సాయి గౌండ, ఈశ్వర్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షీ టీం విద్యార్థులకు తోడుగా ఉంటుంది



నస్రుల్లాబాద్: షీ టీం విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతుందని ఎస్సై రాఘవేంద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళా బృందం ద్వారా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయో వివరించారు. సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అత్యవసర సమయంలో 100 నెంబరుకు కాల్ చేయాలని, విద్యార్థులే తమ ఇంట్లో జరిగే సైబర్ క్రైంలను అరికట్టేలా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కళాజాత బృందం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, శేషారావు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీపై అవగాహన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తనూర్, వజ్జపల్లి గ్రామాల శివారులో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో పురుగు మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి మాట్లాడుతూ.. డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారి చేయడం వల్ల రైతులకు సమయం ఆదా అవుతుందన్నారు. పది నిమిషాల్లోనే ఎకరం విస్తీర్ణంలో డ్రోన్‌తో పురుగుమందును పిచికారి చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఈవో ప్రణీత, సీఈవో నయీం, రైతులు పాల్గొన్నారు.

పంటలను ముంచిన వరద



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి, మార్పల్లి, లింగంపల్లి, అచ్చంపేట, ఆరేడ్, ఆరేపల్లి గ్రామ శివారుల్లో పంటలు వరద నీటిలో మునిగాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ఎత్తి దిగువనకు వరద నీటిని విడుదల చేయడంతో పాటు నల్లవాగు మత్తడి పొంగి పొర్లడంతో వరద నీరు పోటెత్తింది. దీంతో వరద నీరు మంజీరా నది పరివాహక పంటపొలాలను ముంచెత్తాయి. మూడు, నాల్గు రోజుల పాటు వరద నీరు పంట పొలాల నుంచి ప్రవహించడంతో పాటు నిల్వ ఉండటంతో వరిపైర్లు కుల్లి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాగి గ్రామానికి చెందిన ద్యానబోయిన రాజశేఖర్ 6 ఎకరాలు కౌలుకు తీసుకొని నాటు వేయగా ఆరు ఎకరాలను వరద నీరు ముంచెత్తింది. ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నారు.

కొత్త రేషన్‌కార్డు ఉత్తరాల పంపిణీ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లిలో గురువారం కొత్త రేషన్ కార్డు మంజూరు ఉత్తరాలను లబ్ధిదారులకు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిల పేర్లతో ఉన్న ఆహార భద్రత కొత్తరేషన్ కార్డు ఉత్తరాలు దేవునిపల్లి పరిధిలోని నాలుగు రేషన్ దుకాణాల వారీగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సెప్టెంబర్ నెల బియ్యం తీసుకోవడానికి మంజూరు ఉత్తరంతో పాటు ఆధార్‌కార్డు తీసుకెళ్తే సరిపోతుందని రేషన్ డీలర్ల సంఘం నాయకులు ఎల్.లక్ష్మీపతి తెలిపారు. వివిధ పార్టీల నాయకులు యు.నరేష్, కాసర్ల రవీందర్, రజనీకాంత్‌రావు, వెంకట్‌రావు, రాజు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



ఎల్లారంలో ఇందిరమ్మ ఇల్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేష్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. గురువారం ఆయన ఎల్లారం, బూరుగిద్ద గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేస్తే దశల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. వదల్‌పర్తిలో గురువారం పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. దీంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో పదో తరగతి పూర్తిచేసినవారితో మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రాల్లో చేరి వృత్తి విద్య కోర్సులను పూర్తిచేసుకొని ఉపాధి పొందాలని సూచించారు. జీపీ కార్యదర్శి అజీమోద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు ఉన్నారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. గురువారం కాటేపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లబ్ధిదారులు త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటే వారికి విడుతల వారీగా బిల్లులు వస్తాయని తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, కారోబార్ షేక్ జబ్బర్ పాల్గొన్నారు.

పనుల జాతరకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు, తండాల్లో చేపట్టబోయే పనుల జాతరకు అధికారులు సిద్ధం కావాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు, సాంకేతిక సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. నేటి నుంచి పనుల జాతరలో ఎలాంటి పనులు చేయాలి, ఏఏ పనులు చేపట్టాలని చర్చించినట్లు తెలిపారు. డ్రైడే, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీవో మలహరి, ఏపీవో, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల జాతరను విజయవంతం చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి పనుల జాతర–2025ను విజయవంతం చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంటులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో కృష్ణాగౌడ్, జీపీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంటుల, ఫీల్డు అసిస్టెంటులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శించారు. నాయకులు వెంకట్‌గౌడ్, మోతిరాం, నర్సింలు, అరుణ్, సత్యం తదితరులున్నారు.

డ్రగ్స్ బారిన పడొద్దు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు డ్రగ్స్‌బారిన పడకుండా జీవితానికి బంగారుబాటలు వేసుకోవాలని మోటివేషనల్ స్పీకర్ సంజీవులు అన్నారు. తాడ్వాయి ప్రభుత్వ పాఠశాలలో గురువారం మాదక ద్రవ్యాల నిరోధకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.హెచ్‌ఎం కళ్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల తొలగింపు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో కేబుల్ వైర్లను తొలగిస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ విజయసారథి గురువారం తెలిపారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, లింగంపేట మండలాలలో విద్యుత్ స్తంభాలకు అనుకుని జిగ్‌జాగ్‌గా ఉన్న పనికి రాని కేబుల్ వైర్లను తొలగించినట్లు తెలిపారు. ఏఈ వెంకటస్వామి తదితరులున్నారు.

ప్రిప్రైమరీ పాఠశాలల ప్రారంభం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని అంజనీ తండా, సీతారాం తండాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభం కానున్నానయని గురువారం ఎంఈవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. రెండు పాఠశాలల పరిధిలో యూకేజీలో అడ్మిషన్లు ఇస్తున్నామని, నాలుగేళ్లు పైబడిన చిన్నారులను యూకేజీలో చేర్పించాలని కోరారు.

మహాధర్నాను సక్సెస్ చేయాలి

నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద వచ్చే నెల 1న నిర్వహించ తలపెట్టిన ధర్నాను సక్సెస్ చేయాలని పీఆర్టీయూ నాయకులు పిలుపునిచ్చారు. గురువార మండల కేంద్రంలో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. నాయకులు భాస్కర్‌గౌడ్, సంతోష్, సురేందర్, జనార్దన్, రాజు తదితరులున్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మహాధర్నా వాల్ పోస్టర్‌లను పీఆర్‌టీయూ నాయకులు ఆవిష్కరించారు. యూనియన్ మండల అధ్యక్షుడు జగదీష్, మండల కార్యదర్శి కిషోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, హెచ్‌ఎం కమల, నాగనాథ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్' మృతులకు రూ.50 లక్షలు చెల్లించాలి

కామారెడ్డి అర్బన్: వినాయకుల తరలింపులో విద్యుత్ తీగలు తగిలి దుర్మరణం చెందిన యువకుల ఒక్కో కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రమాదాలకు అధికారులే కారణమని, తీగలు వేలాడుతున్నా అధికారులు సరిచేయడం లేదని, ప్రమాదాల్లో యువకులు చనిపోతే చిన్నదిగా చేసే ప్రయత్నాలు మానుకోవాలని బాలస్వామి అన్నారు. హిందువుల పండుగలపై నిర్లక్ష్యం చేయవద్దని, గణేష్, దసరా, బతుకమ్మ, దీపావళీ ఉత్సవాల్లో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాలస్వామి డిమాండ్ చేశారు.